క్లుప్తంగా

మట్టి విగ్రహాలను పూజించాలి



పెన్‌పహాడ్‌లో మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్న తూముల సాయి

పెన్‌పహాడ్ : మట్టి విగ్రహాలను పూజించి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని బీజేపీ నాయకుడు తూముల సాయి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో మట్టి విగ్రహాలను పంపిణీ చేసి మాట్లాడారు. మండల కేంద్రానికి చెందిన తూముల జగదీశ్వర్‌రావు జ్ఞాపకార్థం కుమారులు మోహిత్, సాయిలు సుమారు రూ.4లక్షల విలువైన మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నూనావత్ బోడి, నరహరి, రాము, వినోద్, హన్మంతు, నాగరాజు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం ఆదుకోవాలి

నాగారం : తల్లిదండ్రులను కోల్పోయి అనాథలుగా మారిన ఈటూరు గ్రామానికి చెందిన అక్కాచెల్లెళ్లు వంగూరి దివ్య, సంధ్యలను ప్రభుత్వం ఆదుకోవాలని సామాజిక ఉద్యమకారుడు, యూడీఎఫ్(యూనైటెడ్ డెమోక్రటిక్ ఫోరం) అధ్యక్షుడు పులిగిళ్ల వీరమల్లు యాదవ్ డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. అనాథ యువతులకు ప్రభుత్వం దళితబంధుతో పాటు డబుల్‌బెడ్‌రూం ఇళ్లు, అంబేద్కర్ ఓవర్సీస్ ఎడ్యుకేషన్ స్కీంలను వర్తింపజేయాలని కోరారు.

నూతన కలెక్టరేట్‌కు బీఎన్ రెడ్డి పేరు పెట్టాలి

దురాజ్‌పల్లి : తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు భీంరెడ్డి నర్సింహారెడ్డి పేరును సూర్యాపేట జిల్లా కలెక్టరేట్‌కు పెట్టాలని ఏంసీపీఐ(యూ) తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వరికుప్పల వెంకన్న మంత్రి జగదీష్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పంటలకు గోదావరి నది జలాలు అందించాలని పరితపించిన వ్యక్తి బీఎన్‌రెడ్డి అని అన్నారు. రెండుసార్లు ఎమ్మెల్యేగా, మూడుసార్లు ఎంపీగా 25 సంవత్సరాలు ప్రజా ప్రతినిధిగా ఎన్నికై అసెంబ్లీ, పార్లమెంట్‌లో ప్రజల కోసం పోరాటం చేశారని తెలిపారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి షేక్ నజీర్, ఏషబోయిన సుధీర్, మురపాక ఉగ్రయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఓటరు లిస్టు పరిశీలించుకోవాలి



ఓటర్లకు అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్

నూతనకల్ : ప్రతి ఒక్కరూ ఓటరు లిస్టును పరిశీలించుకొని తప్పిదాలను సరిచేసుకోవాలని నాయబ్ తహసీల్దార్ శ్రీధర్ నాయక్ కోరారు. శుక్రవారం మండల తహసీల్దార్ కార్యాలయంలో ఓటర్లకు అవగాహన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఓటరు లిస్టులో పేరు తప్పిదాలను సరిచేసుకోవడం ప్రతి ఓటరు బాధ్యత అని అన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడి మృతికి సంతాపం

అర్వపల్లి : అర్వపల్లి జెడ్పీహెచ్‌ఎస్ స్కూల్ అసిస్టెంట్ సైరెడ్డి మల్లారెడ్డి శుక్రవారం రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. దీంతో అతడి మృతికి హెచ్‌ఎం జెల్లా ప్రసాద్ సంతాపం వ్యక్తం చేశారు. అలాగే ఆ పాఠశాల ఉపాధ్యాయ బృందం మల్లారెడ్డికి నివాళులర్పించింది.

క్రీడా పోటీలు ప్రారంభం



క్రీడలను ప్రారంభిస్తున్న ఎంపీపీ

చివ్వెంల : క్రీడలతో మానసికోల్లాసం లభిస్తుందని ఎంపీపీ ధరావతు కుమారి బాబునాయక్ అన్నారు. శుక్రవారం బి.చందుపట్లలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి అండర్–17 క్రీడా పోటీలను ప్రారంభించి మాట్లాడారు. రెండు రోజుల పాటు ఈ పోటీలు ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ భుక్యా సంజీవ్ నాయక్, ఎంఈఓ గోపాల్‌రావు, సర్పంచ్ బోయిళ్ల క్రిష్ణ, ఎంపీటీసీ కోటి బండ్లయ్య, హెచ్‌ఎం తోట సరళ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

మృతుడికి నివాళి

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండలం సీతారాంపురం గ్రామానికి చెందిన గుర్రాల కాశయ్య శుక్రవారం మృతిచెందారు. దీంతో అతడి మృతదేహానికి జెడ్పీటీసీ దావుల వీరప్రసాద్‌యాదవ్, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కడెం రామచంద్రయ్య వేర్వేరుగా నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో సర్పంచ్ బైరబోయిన సునీతారామలింగయ్య, మాజీ మార్కెట్ డైరెక్టర్ బండెల అర్వపల్లి, అరిగె వెంకన్న, కడారి నరేష్, బీజేపీ నాయకులు రాజు, కూర శంకర్, శ్రీనివాస్, హనుమంతు, దీన్‌దయాళ్ తదితరులు ఉన్నారు.

విగ్రహాల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి



సూర్యాపేట రూరల్ : మాట్లాడుతున్న డీఎస్పీ

సూర్యాపేట రూరల్ : వినాయక చవితి సందర్భంగా విగ్రహాల ఏర్పాటుకు నిర్వాహకులు తప్పనిసరిగా పోలీసుల అనుమతి తీసుకోవాలని డీఎస్పీ నాగభూషణం అన్నారు. శుక్రవారం సూర్యాపేట రూరల్ పోలీస్ స్టేషన్‌లో శాంతి కమిటీ సమావేశం నిర్వహించి మాట్లాడారు. గణేష్ నవరాత్రి ఉత్సవాలకు పోలీసు భద్రత ఉంటుందన్నారు. మండపాలు రోడ్డు మధ్యలో ఏర్పాటు చేసి వాహనదారులకు ఇబ్బంది కలిగించొద్దన్నారు. డీజేలు, బాణసంచాలకు అనుమతి లేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో రూరల్ సీఐ అశోక్‌రెడ్డి, ఎస్‌ఐ సాయిరాం, శాంతికమిటీ సభ్యులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

అర్వపల్లి : వినాయక చవితి ఉత్సవాల నిర్వహణకు నిర్వాహకులు తప్పనిసరిగా పోలీసుల అనుమతి తీసుకోవాలని ఎస్‌ఐ బి.అంజిరెడ్డి తెలిపారు. శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. వినాయక విగ్రహాలు ప్రతిష్ఠించే నిర్వాహకులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొని అనుమతి పొందాలన్నారు. నియమ, నిబంధనలు పాటిస్తూ ప్రశాంత వాతావరణంలో పండుగ జరుపుకోవాలని సూచించారు.

నిబంధనలు పాటించాలి

నూతనకల్ : వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని గ్రామాల్లో విగ్రహాలను ఏర్పాటు చేసే నిర్వాహకులు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని ఎస్‌ఐ నరేష్ కోరారు. శుక్రవారం పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విగ్రహాల ప్రతిష్ఠ, మండపాల ఏర్పాటుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. విద్యుత్ సరఫరా కోసం విద్యుత్ శాఖల అనుమతి తీసుకోవాలని అన్నారు.

కాంగ్రెస్ సభను జయప్రదం చేయాలి



తుంగతుర్తి : మాట్లాడుతున్న నాయకులు

భానుపురి : సెప్టెంబరు 17న హైదరాబాద్‌లోని తుక్కుగూడలో జరిగే కాంగ్రెస్ పార్టీ భారీ బహిరంగ సభకు సూర్యాపేట నియోజకవర్గం నుంచి పెద్దసంఖ్యలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పటేల్ రమేష్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ప్రతి గ్రామం నుంచి సూర్యాపేటకు ఉదయం 11 గంటల వరకు చేరుకోవాలని, అక్కడి నుంచి సభకు బయలుదేరాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పెద్దిరెడ్డి రాజా, గోదాల రంగారెడ్డి, శనగాని రాంబాబు, వడ్డె ఎల్లయ్య, ముదిరెడ్డి రమణారెడ్డి, కౌన్సిలర్లు వెలుగు వెంకన్న, నామా ప్రవీణ్, వల్దాస్ దేవేందర్, రమేష్ నాయుడు, ఫరూక్, సైదిరెడ్డి, స్వామి నాయుడు పాల్గొన్నారు.

తుంగతుర్తి : ఈ నెల 17న తుక్కుగూడలో జరిగే కాంగ్రెస్ విజయభేరి సభను జయప్రదం చేయాలని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర సోషల్ మీడియా కోఆర్డినేటర్ కొండా రాజు కోరారు. శుక్రవారం మండల కేంద్రంలోని మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి నివాసంలో ఏర్పాటు చేసిన పార్టీ నియోజకవర్గ స్థాయి సోషల్ మీడియా రివ్యూ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలన్నారు. గ్రామ, గ్రామాన పార్టీ బలోపేతానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. సోనియాగాంధీ పాల్గొనే విజయభేరి సభకు ప్రజలు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు. ఈ సమావేశంలో తుంగతుర్తి నియోజకవర్గ సోషల్ మీడియా కోఆర్డినేటర్ రామడుగు నవీన్, కొత్తపల్లి ఉపేందర్, కొలిపాక సాయి, హరీష్, మహేష్, జయంత్, రవి, సైదులు, నవీన్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

నేడు సాయుధ పోరాట వారోత్సవాల ముగింపు సభ



మాట్లాడుతున్న నెమ్మాది వెంకటేశ్వర్లు

పెన్‌పహాడ్ : చీదెళ్లలో శనివారం నిర్వహించే తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల ముగింపు సభను విజయవంతం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు నెమ్మాది వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం చీదెళ్లలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం నేటి తరానికి ఆదర్శం అని అన్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా సూర్యాపేట ప్రాంతంలో ఏ ఊరికి వెళ్లినా ఆనాటి త్యాగాల పోరాటం ఆనవాలు నేటికీ కనబడుతున్నాయని తెలిపారు. అలాంటి చరిత్రను నేటి పాలకులు వక్రీకరిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి రణపంగ కృష్ణ, జిల్లా కమిటీ సభ్యుడు చినపంగి నర్సయ్య, అడ్డి అంజిబాబు, కొండమీది రాములు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి



తుంగతుర్తిలో సీడీపీఓకు వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీలు



పెన్‌పహాడ్ : సమ్మెలో మోకాళ్లపై నిలబడి నిరసన వ్యక్తం చేస్తున్న అంగన్‌వాడీలు

తుంగతుర్తి : రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని అంగన్‌వాడీ ప్రాజెక్టు నాయకురాలు స్వరూప అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఐసీడీఎస్ కార్యాలయంలో సీడీపీఓ వెంకటరమణకు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. అంగన్‌వాడీ ఉద్యోగులను క్రమబద్ధీకరించి, కనీస వేతనం రూ.26వేలు, పెన్షన్, ఈఎస్‌ఐ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. సుప్రీం కోర్టు తీర్పుప్రకారం అంగన్‌వాడీ ఉద్యోగులకు గ్రాట్యూటీ చెల్లించాలని, రిటైర్మెంట్ బెనిఫిట్ టీచర్లకు రూ.10లక్షలు, హెల్పర్లుకు రూ.5లక్షలు ఇవ్వాలని, వేతనంలో సంగం పెన్షన్ నిర్ణయించాలన్నారు. ప్రమాద బీమా సౌకర్యం రూ.5లక్షలు చెల్లించాలని కోరారు. అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించకుంటే నేటి నుంచి నియోజకవర్గంలో ధర్నాలు చేపడుతామని తెలిపారు.కార్యక్రమంలో అంగన్‌వాడీలు మంగమ్మ, శ్రీదేవి, సీఐటీయూ నాయకులు కొలిశెట్టి యాదగిరిరావు, బుర్ర శ్రీను, రాజారాం పాల్గొన్నారు.

పెన్‌పహాడ్ : అంగన్‌వాడీ టీచర్ల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కన్వీనర్ భాస్కరమ్మ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఐదవ రోజు సమ్మెలో పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం అంగన్‌వాడీలకు కనీస వేతనం ఇవ్వకుండా వెట్టి చాకిరీ చేయించుకుంటుందని ఆవేదన వ్యక్తం చేశారు.పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలు, సెంటర్ అద్దెలు చెల్లించలేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు.కార్యక్రమంలో అంగన్‌వాడీటీచర్స్ రణపంగ లలిత, వసంత, లక్ష్మి, జానీబేగం, జయమ్మ, మంజుల, వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.

సెప్టెంబర్ 17న విద్రోహ దినంగా పాటించాలి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

సూర్యాపేటటౌన్ : సెప్టెంబర్ 17ను విద్రోహ దినంగా పాటించాలని పీడీఎస్‌ఎఫ్ జిల్లా కన్వీనర్ మరికంటి హరీష్ అన్నారు. విద్రోహ దినం కరపత్రాన్ని శుక్రవారం జిల్లా కేంద్రంలోని బాబూ జగ్జీవన్ రామ్ విగ్రహం వద్ద ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నిజాంతో కుమ్మక్కైన నెహ్రూ–పటేల్ ప్రభుత్వం హైదరాబాద్ సంస్థానాన్ని ఇండియన్ యూనియన్‌లో విలీనం చేస్తున్నామనే సాకుతో 50 వేల సైన్యంతో ప్రజలపై దాడి చేసిన రోజు ముమ్మాటికి విద్రోహమేనన్నారు. ఈ ఘటనలో లక్షలాది మంది జైలు పాలయ్యారని తెలిపారు. లైంగిక దాడులు, ఆస్తుల ధ్వంసం, హత్యలు, మహిళల అక్రమ నిర్బంధం, మహిళల అపహరణ, గృహాలు, పంటలు, వ్యాపార సంస్థల ధ్వంసం, భూముల ఆక్రమణ, మసీదుల ధ్వంసం వంటి ఎన్నో ఆకృత్యాలు జరిగాయని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో వెంకట్, చందుపట్ల శ్యామ్, కన్న, సంతోష్, నవీన్, రాజు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ దళితబంధు వర్తింపజేయాలి



దిర్శనపల్లిలో ధర్నా నిర్వహిస్తున్న దళితులు

నూతనకల్ : అర్హులందరికీ దళితబంధు పథకం వర్తింపజేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి గంటా నాగయ్య ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం మండల పరిధిలోని దిర్శనపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట దళితులు నిర్వహించిన ధర్నాలో పాల్గొని మాట్లాడారు. దళితబంధు పథకం బీఆర్‌ఎస్ కార్యకర్తల బంధుగా మారిందని ఆయన ఆరోపించారు. గతంలో పరిపాలించిన ప్రభుత్వాలు పాలకపక్షంతో పాటు ప్రతిపక్ష పార్టీలకు చెందిన వారికి కూడా సంక్షేమ పథకాలు అందించాయని తెలిపారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో దళారులకు, రాజకీయ నాయకులకు మాత్రమే పథకాలు అందుతున్నాయని అన్నారు. కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు గంటా లింగరాజు, నరేష్, రామకృష్ణ, రవిశంకర్, మధుసూదన్, మేడి భిక్షం, వెంకన్న, చుక్క ఉప్పమ్మ, నాగలక్ష్మి పాల్గొన్నారు.

‘బీఆర్‌ఎస్ నాయకులకే పథకాలు సరికాదు’

ఆత్మకూర్(ఎస్) : బీఆర్‌ఎస్ కార్యకర్తలకే పథకాలు అందిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం ఆలోచన విధానాలు మానుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్వర్లు కోరారు. శుక్రవారం తుమ్మలపెన్‌పహాడ్‌లో నిర్వహించిన వ్యవసాయ కార్మిక సంఘం గ్రామశాఖ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాలను అర్హులైన పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలకు వర్తింపజేయాలన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఒంటెద్దు పోకడతో వ్యవహరిస్తోందని విమర్శించారు. ఈ సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కమిటీ సభ్యులు బండారు నాగయ్య, తండ చంద్రయ్య, భిక్షం, మల్లయ్య పాల్గొన్నారు.

స్నేహితుడికి రూ. 50వేల ఆర్థికసాయం



శేఖర్ కుటుంబీకులకు ఆర్థికసాయం అందజేస్తున్న తోటి స్నేహితులు

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండలం పర్సాయపల్లి సర్పంచ్ పుప్పాల శేఖర్ అకస్మాత్తుగా అస్వస్థతకు గురై ప్రాణాప్రాయ స్థితిలో ఉండి హైదరాబాద్‌లోని ఓ కార్పొరేట్ ఆస్పత్రిలో ఐసీయూలో చికిత్స పొందుతున్నారు. అయితే ఆపదలో ఉన్న స్నేహితుడిని ఆదుకోవడానికై వైద్య ఖర్చులకోసం అర్వపల్లిలోని విజ్ఞాన్ ఉన్నత పాఠశాల 2000–2001 ఏడాది 10వ తరగతి బ్యాచ్ పూర్వవిద్యార్థులు శుక్రవారం రూ.50వేల ఆర్థికసాయాన్ని శేఖర్ కుటుంబ సభ్యులకు హైదరాబాద్‌లో అందజేశారు. తమ స్నేహితుడు పక్షవాతానికి గురై ప్రాణాపాయ స్థితిలో ఉండగా తమ వంతుగా ఆర్థికసాయం అందించినట్లు టెన్త్ బ్యాచ్ విద్యార్థులు తెలిపారు.

రూ.5000 ఆర్థికసాయం అందజేత

నాగారం : మండల పరిధిలోని ఫణిగిరికి చెందిన చర్లపల్లి ఉప్పలయ్య గురువారం అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు ఎర్ర యాదగిరి శుక్రవారం మృతుడి భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, రూ.5,000 ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు కల్లెట్లపల్లి శ్రీనివాస్, ఉపసర్పంచ్ ఎర్ర నరేష్, నాతి మహేష్, నర్సయ్య, రమేష్, బలరాజు పాల్గొన్నారు.


విద్యార్థులకు నగదు ప్రోత్సాహకం అందజేత



విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు అందజేస్తున్న కెనరా బ్యాంక్ సిబ్బంది, ఉపాధ్యాయులు

తుంగతుర్తి : మండల పరిధిలోని గొట్టిపర్తి జెడ్పీహెచ్‌ఎస్‌లో 2022–23 విద్యా సంవత్సరంలో ఉత్తమ ప్రతిభ కనబర్చి ఎక్కువ మార్కులు సాధించిన ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు కెనరా బ్యాంక్ ఆధ్వర్యంలో శుక్రవారం నగదు ప్రోత్సాహకాలు అందజేశారు. విద్యాజ్యోతి పథకం కింద కెనరా బ్యాంక్ మేనేజర్ భూక్య రవి 6, 7 తరగతులు చదువుతున్న విద్యార్థులకు రూ.2500 చొప్పున, 8, 9, 10 తరగతులు చదువుతున్న విద్యార్థులకు రూ.5,000 చొప్పున నగదు చెక్కులు అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం షేక్.ఉమర్, ఉపాధ్యాయులు ఆర్.విజయ, మంజుల, ఫజల్, భానుప్రియ, మంగు, రాజు, లింగయ్య, గౌస్, కిరణ్, మమత, కెనరా బ్యాంక్ సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కార్మిక సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



మాట్లాడుతున్న సత్యనారాయణగౌడ్

నూతనకల్ : కార్మిక సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని బీఆర్‌ఎస్‌కేవీ నియోజకవర్గ బాధ్యుడు గౌడిచర్ల సత్యనారాయణగౌడ్ అన్నారు. శుక్రవారం వెంకెపల్లిలో నిర్వహించిన బీఆర్‌ఎస్‌కేవీ ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొని మాట్లాడారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తరువాత కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం ఎనలేని కృషి చేస్తోందని తెలిపారు. అనంతరం వెంకెపల్లి గ్రామ భవన నిర్మాణ కార్మిక సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పాల్వాయి బుచ్చయ్య, ప్రధాన కార్యదర్శిగా నేతి గోపిలను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మాతంగి సోమనర్సమ్మ, బీఆర్‌ఎస్ మండల ప్రధాన కార్యదర్శి బత్తుల సాయిలుగౌడ్, మర్రి బాలయ్య, కూరపాటి సోమేష్, ఎడ్ల శ్రీను, చిత్తలూరి రాజీవ్, గుడిపాటి సైదులు, చింతకుంట్ల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

ఆత్మకూర్ (ఎస్) : సీఐటీయూ మండల నూతన కమిటీని ఎన్నుకున్నట్లు జిల్లా అధ్యక్షుడు రాంబాబు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. నూతన అధ్యక్షుడిగా యాతాకుల వెంకన్న, కమిటీ సభ్యులుగా మండల వీరన్న, ఎరుకల భిక్షం, మారపాక ముత్తయ్య, ఎం.విజయారెడ్డి, పిడుగు శ్రీను, నవిలే వెంకన్న, విజయ, బండారు నాగయ్య, జైల్ సింగ్, జలగం భిక్షం, కోదూరు మల్లయ్య ఎన్నికైనట్లు తెలిపారు.

కమ్యూనిస్టులే నిజమైన సాయుధ పోరాట వారసులు



మామిడిపల్లిలో అమరుల చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

నాగారం : తెలంగాణ సాయుధ పోరాటానికి నిజమైన వారసులు కమ్యూనిస్టులేనని సీపీఎం మండల కార్యదర్శి కడియం కుమార్ అన్నారు. తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం మామిడిపల్లిలో అమర వీరుల స్థూపాల వద్ద జెండాలను ఆవిష్కరించారు. అమరవీరుల చిత్రపటాలకు నివాళులర్పించి మాట్లాడారు. దున్నేవాడికే భూమి కావాలని, వెట్టిచాకిరీ రద్దు చేయాలని, నైజాం నవాబు గద్దెదిగాలని ఎర్రజెండాల నాయకత్వంతో సాగిన పోరాటంలో తెలంగాణ వ్యాప్తంగా 10లక్షల ఎకరాల భూమి పంపిణీ చేయబడిందని, 3వేల గ్రామరాజ్యాలు ఏర్పాడ్డాయని, 4వేల మంది తమ ప్రాణాలను అర్పించారన్నారు. నాటి పోరాట ఫలితంగానే వెట్టిచాకిరీ రద్దయ్యిందని, భూ పంపిణీ చట్టం వచ్చిందన్నారు. అందరికీ స్వేచ్ఛ, విద్య, ఉపాధి అవకాశాలు లభించాయన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు కండె భిక్షం, మొల్కపురి మహేందర్, పుల్లయ్య, పద్మ, నాగమ్మ, బైరబోయిన యాదమ్మ, వెంకన్న, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

బిల్లు పెట్టకపోతే బీజేపీకి గుణపాఠం తప్పదు



ఆత్మకూరులో దీక్షలో కూర్చున్న నాయకులు



చివ్వెంలలో..

ఆత్మకూర్ (ఎస్) : ఈ నెల 18 నుంచి జరగనున్న పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టకపోతే బీజేపీకి గుణపాఠం తప్పదని ఎమ్మార్పీఎస్ జిల్లా కో ఇన్‌చార్జ్ ములకలపల్లి రవి మాదిగ అన్నారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట చేపట్టిన దీక్షలకు హాజరై మాట్లాడారు. రిలే నిరాహార దీక్షలు ఈ నెల 22వరకు కొనసాగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు మేడి కృష్ణ, ప్రధాన కార్యదర్శి తిప్పర్తి గంగరాజు, నాయకులు చిన్ని, మధు, యాదయ్య, వెంకన్న, లింగయ్య, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న రిలే నిరాహార దీక్ష

చివ్వెంల : పార్లమెంట్ సమావేశాల్లో ఏబీసీడీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలని డిమాండ్ చేస్తూ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్ష శుక్రవారం కొనసాగింది. ఈ కార్యక్రమంలో మండల ఇన్‌చార్జ్ చెరుకుపల్లి సతీష్, రాజు, నవీన్, సురేష్, అనిల్, ప్రభాకర్, మహేష్, మహేందర్, విజయ్, కిరణ్, ప్రవీణ్, వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

ఏటీఎం కావాలంటే ‘పేట’కు వెళ్లాల్సిందే!

- అర్వపల్లిలో ఏటీఎం లేక ప్రజల పాట్లు
- నగదు అవసరమైతే సూర్యాపేటకు వెళ్లాల్సిరావడంతో తప్పని ఇబ్బందులు

అర్వపల్లి : సూర్యాపేట–జనగామ, నకిరేకల్–తానంచర్ల రెండు జాతీయ రహదారులు కలిసే ప్రధాన కూడలి, జాజిరెడ్డిగూడెం మండల కేంద్రమైన అర్వపల్లిలో ఏటీఎం లేక ప్రజలు నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. జాజిరెడ్డిగూడెంలోని భారతీయ స్టేట్ బ్యాంక్ వారికి అర్వపల్లిలో ఏటీఎం ఏర్పాటు చేయాలని ఎంతో కాలంగా విన్నవించుకుంటున్నా ప్రయోజనం లేకుండా పోయిందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జాజిరెడ్డిగూడెం మండలం అయినప్పటికి అర్వపల్లి హైవేపై ఉండడంతో ప్రభుత్వ కార్యాలయాలన్ని ఇక్కడే ఏర్పాటు చేశారు. దీంతో ప్రతిరోజు వందలాది మంది తమ పనుల నిమిత్తం అర్వపల్లికి వచ్చి పోతుంటారు. పైగా అర్వపల్లి మీదుగా రెండు హైవేలు నిర్మించడంతో ఈ దారుల గుండా ప్రతి రోజు వేలాది వాహనాలు వెళ్తుంటాయి. చాలామంది వాహనచోదకులు, ప్రయాణికులు అర్వపల్లి పనుల నిమిత్తం ఆగి వెళ్తుంటారు. కానీ నగదు అవసరమైనప్పుడు ఏటీఎం అందుబాటులో ఉండకపోవడంతో ప్రజలు, ప్రయాణికులు నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ గతంలో ప్రైవేట్ సంస్థ వారు ఏటీఎం ఏర్పాటు చేసినప్పటికీ నిర్వహణ కొరవడి మూసివేశారు. దీంతో చేసేదేమీ లేక అర్వపల్లిలోని ప్రజలు, ప్రయాణికులు ఏటీఎం అవసరం ఏర్పడితే 27 కిలోమీటర్ల దూరంలోని సూర్యాపేట జిల్లా కేంద్రానికి వెళ్లాల్సి వస్తోంది. ఇప్పటికైనా బ్యాంకు అధికారులు స్పందించి అర్వపల్లిలో ఏటీఎం ఏర్పాటు చేసి ఇబ్బందులు తీర్చాలని ప్రజలు, ప్రయాణికులు కోరుతున్నారు.

వ్యయ ప్రయాసాలకు లోనవుతున్నాం

అర్వపల్లిలో ఏటీఎం లేక నిత్యం వ్యయ ప్రయాసాలకు లోనవుతున్నాం. ఏటీఎంలో డబ్బులు తీసుకోవాలంటే సూర్యాపేటకు వెళ్లాల్సి వస్తోంది. ఏదైనా బ్యాంకు వారు అర్వపల్లిలో వెంటనే ఏటీఎంను ఏర్పాటు చేసి ప్రజల ఇబ్బందులు తీర్చాలి.

– నజీర్, విద్యార్థి, అర్వపల్లి

అనేక సార్లు విన్నవించాం

జాజిరెడ్డిగూడెం ఎస్‌బీఐ ఆధ్వర్యంలో అర్వపల్లిలో ఏటీఎం ఏర్పాటు చేయాలని ఆ శాఖ ఉన్నతాధికారులకు అనేక సార్లు విన్నవించాం. గతంలో ఎస్‌బీఐ వారు ఏటీఎం ఏర్పాటుకు హామీ ఇచ్చినా ఇంతవరకు అమలుకాలేదు. ఇప్పటికైనా అర్వపల్లిలో ఏటీఎంను ఏర్పాటు చేయాలి.

– మచ్చ నర్సయ్య, సామాజిక కార్యకర్త

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



చెక్కు పంపిణీ చేస్తున్న తాటికొండ సీతయ్య

తుంగతుర్తి : సీఎం సహాయనిధిని బాధితులు సద్వినియోగం చేసుకోవాలని బీఆర్‌ఎస్ తుంగతుర్తి మండల అధ్యక్షుడు తాటికొండ సీతయ్య అన్నారు. మండల పరిధిలోని అన్నారం గ్రామానికి చెందిన గుండగాని వీరయ్యకు రూ.28,000, తుంగతుర్తికి చెందిన ఈదుల ముత్తమ్మకు రూ.32,000 చొప్పున ప్రభుత్వం నుంచి మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను శుక్రవారం మండల కేంద్రంలో పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ గుడిపాటి సైదులు, నాయకులు గుండగాని రాములుగౌడ్, దొంగరి శ్రీను, కటకం వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, రమేష్, వెంకన్న, భిక్షం, పరమేష్, జలేందర్, సంతోష్, రవికుమార్, మల్లేష్, వెంకటేష్, నాయకులు పాల్గొన్నారు.

రెండో విడత దళితబంధు ప్రక్రియ షురూ

అర్వపల్లి : రెండో విడత దళితబంధు సాయం ప్రక్రియ మొదలైంది. జాజిరెడ్డిగూడెం మండలానికి సంబంధించి ఈ రెండో విడతలో 93 యూనిట్లు మంజూరయ్యాయి. జాజిరెడ్డిగూడేనికి 13, అర్వపల్లికి 7, కాసర్లపహాడ్‌కు 4, ఉయ్యాలవాడకు 2, కుంచమర్తికి 4, వేల్పుచర్లకు 1, లోయపల్లికి 4, అడివెంలకు 7, బొల్లంపల్లికి 3, తిమ్మాపురం గ్రామానికి 12, కోమటిపల్లికి 1, కోడూరుకు 9, కొమ్మాలకు 13, పర్సాయపల్లికి 6, రామన్నగూడేనికి 7 చొప్పున యూనిట్లు మంజూరయ్యాయి. అయితే శుక్రవారం లబ్ధిదారుల దళితబంధు బ్యాంక్ ఖాతాలు తెరిచే పనులను ప్రారంభించారు. యూనిట్ల ఎంపిక, ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ తదితర పనులు త్వరలో మొదలవుతాయని ఎంపీడీఓ కతురోజు ఉమేష్ తెలిపారు.

20 వరకు గడువు

అర్వపల్లి : అర్వపల్లిలోని శ్రీవిజ్ఞాన్ ఐటీఐ కళాశాలలో నాలుగో విడత ప్రవేశాల గడువు ఈ నెల 20 వరకు ఉందని కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్. హరికుమార్ తెలిపారు. 2023–24 విద్యా సంవత్సరానికి గాను మిగిలి ఉన్న సీట్ల కోసం నాలుగో విడత ప్రవేశాలకై ఈ నెల 20న ఉదయం 11 గంటల వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారు దరఖాస్తు ఫారాలను స్థానిక ఐటీఐలో సమర్పించాలని కోరారు.

విద్యార్థులకు మాక్ పోలింగ్



మాక్ పోలింగ్‌లో పాల్గొన్న విద్యార్థులు

సూర్యాపేటటౌన్ : సూర్యాపేట పట్టణంలోని ప్రతిభ విద్యానికేతన్ ఇంగ్లిష్ మీడియం ఉన్నత పాఠశాలలో శుక్రవారం మాక్ పోలింగ్ నిర్వహించారు. విద్యార్థులకు ఓటుపై అవగాహన కల్పించడం కోసం పాఠశాలలో ఓటింగ్ నిర్వహించినట్లు పాఠశాల కరస్పాండెంట్ తెలిపారు. గెలుపొందిన అభ్యర్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు గొల్ల శ్రీనివాస్, ఉపాధ్యాయులు జానయ్య, షరీఫ్, ఉప్పలయ్య, కృష్ణయ్య, సబియా, స్వప్న, సమత, మహేశ్వరి పాల్గొన్నారు.

టీబీ నిర్ధారణ మిషన్ ప్రారంభం

తిరుమలగిరి : తిరుమలగిరి పీహెచ్‌సీలోని డీఎంసీ ల్యాబ్‌లో టీబీ నిర్ధారణ పరీక్షల కోసం నూతనంగా ఏర్పాటు చేసిన మిషన్‌ను శుక్రవారం వైద్యాధికారి మల్లెల వందన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. టీబీ లక్షణాలు ఎవరికైనా కనిపిస్తే ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్ధారణ చేసి ఉచితంగా మందులు ఇస్తామని తెలిపారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ బిచ్చునాయక్ పాల్గొన్నారు.

విరాళం అందజేత

నాగారం : వినాయక చవితి సందర్భంగా టెక్నో డీడ్ ఐటీ కంపెనీ చైర్మన్ వంగూరి దామోదర్ ఈటూరు గ్రామంలో వినాయక విగ్రహాల ప్రతిష్ఠ కోసం గ్రామానికి చెందిన యువజన సంఘాలకు శుక్రవారం విరాళం అందజేశారు. నవ యువత యూత్ అసోసియేషన్‌తో పాటు మొత్తం తొమ్మిది ఉత్సవ కమిటీ సభ్యులకు ఒక్కొక్కరికి రూ.10,000ల చొప్పున ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో గంట సోమిరెడ్డి, తీగుళ్ల పెద్ద నర్సయ్య, యల యాదగిరి, వంగూరి అబ్బులు, తీగుళ్ల శేఖర్, వంగూరి సందీప్, నవ యువత యూత్ సభ్యులు పాల్గొన్నారు.



విరాళం అందజేస్తున్న దాత వంగూరి దామోదర్